# చిన్నబోయిన పెద్దలు

- తమిరిశ జానకి

ఆ రోజు మహిళామండలిలో భాగ్యలక్ష్మి పక్కన కుర్చీ ఖాళీగా ఉన్నా ఆమె పక్కన కూర్చోకుండా ఆ పక్కన యశోద దగ్గరి కెళ్ళి కూర్చుంది సామ్రాజ్యం. "భాగ్యలక్ష్మిగారు కట్టుకున్న చీర బావుంది కదా" ఆ మాటా ఈ మాటా మాట్లాడుతూ యదాలాపంగా అంది యశోద. "ఏం బావుంది ఆ చీర? ఆ కలరేవిటి? ఆ ప్రింటేవిటి?" చప్పరించేసింది సామ్రాజ్యం. ఆ మాటలు వినపడనే వినపడ్డాయి భాగ్యలక్ష్మికి. అందుకే చెల్లుకి చెల్లు అన్నట్టుగా "సామ్రాజ్యం గారి చెప్పులు కొత్త మోడల్లా ఉన్నాయి బావున్నాయి కదూ" అని పక్కన కూర్చున్న సత్యవతి అనగానే "అవేం మోడలసలూ? నా మొహంలా ఉన్నాయి. కొనుక్కోక కొనుక్కోక అలాంటివే కొనుక్కోవాలా? అనేసింది భాగ్యలక్ష్మి. "ఒకప్పుడు వీళ్ళిద్దరూ బాగా స్నేహంగానే ఉండేవారు. ఇప్పుడీమధ్య వీళ్ళిద్దరికీ ఎందుకు పడటంలేదో మరి?" అర్థం కాలేదు సత్యవతికి. నిజమే మరి... ఒకప్పుడు సామ్రాజ్యం, భాగ్యలక్ష్మి బాగా స్నేహంగా ఉండేవారు. ఇద్దరివీ పాత బజార్లో పక్క పక్క ఇళ్ళే. వాళ్ళింట్లో టి.వి. కొన్న రోజునే, నీకెప్పుడు చూడాలనిపిస్తే అప్పుడు మా ఇంట్లో టి.వి. చూడటానికి రా, భాగ్యం... మొహమాట పడకు. మనలో మనకి మొహమాటాలొద్దు" అంటూ సంతోషంగానే భాగ్యలక్ష్మితో చెప్పింది సామ్రాజ్యం.

తన ఇంట్లో మిక్సీ కొనగానే, నీ కెప్పుడేం కావాలన్నా మా మిక్సీలో రుబ్బి ఇస్తాను. అడగటానికి మొహమాట పడకు సామ్రాజ్యం, మనలోమనకి మొహమాటాలు దేనికి" అంటూ సంబరంగా చెప్పింది భాగ్యలక్ష్మి. ఇంట్లో పనంతా అయి, కాసేపు పడుకుని రెస్టు తీసుకుందామనో, ఏ పత్రికో కాసేపు చదువు కుందామనో భాగ్యలక్ష్మి అనుకున్నప్పుడే, "భాగ్యం! కాస్త ఈ పప్పు మీ మిక్సీలో రుబ్బి ఇస్తావా అనో, ఈ చారుపొడి చేసిస్తావా అనో చేతుల్లో గిన్నెల్తో వొచ్చేసేది సామ్రాజ్యం. ఇడ్లీకనో, దోసెలకనో, కారప్పొడనో, చారుపొడి అనో, కందిపొడి అనో వేళకాని వేళల్లో రావడం మామూలైపోయింది సామ్రాజ్యానికి.

టి.వి.లో పాటలు, భరతనాట్యం, నాటకాలు, సినిమాలు ఉన్నప్పుడల్లా నాగా లేకుండా టి.వి. చూడటానికి సామ్రాజ్యం వాళ్ళింటికి రావడం మామూలైపోయింది భాగ్యలక్ష్మికి. వొచ్చినప్పుడల్లా తన ఏడాది కూతురు చిట్టిని, ఆరేళ్ళ కొడుకు శీనుని వెంటపెట్టుకునే వొచ్చేది. టి.వి. చూడటంలో పడిందంటే, ఇంక తన పిల్లలు చేసే అల్లరి పట్టించుకునేది కాదు. ఆ డ్రాయింగ్ రూమ్‌లో ఉన్నవన్నీ ఇటు లాగి అటు లాగి కింద పారేయడం, పుస్తకాలూ పేపర్లూ చింపెయ్యడం, టేబుల్‌క్లాత్ లాగేయడం, ఒకటికి పొయ్యడం నానా హంగామా చేస్తుండేది చిట్టి.

సామ్రాజ్యానికి ఒక కొడుకు, కిషోర్.. శీను ఈడువాడే. వాడితో కల్సి డిష్యుం డిష్యుం చేస్తూ కుర్చీలెక్కి, బల్లలెక్కి పరుగులు పెట్టేస్తూ నానా గొడవా చేసేవాడు శీను. అయినా సరే పిల్లల్ని అదిలించేది కాదు భాగ్యలక్ష్మి. తన మానాన తను టి.వి. చూస్తూ కూచునేది.

"పండక్కి కొత్త చీర కొనియ్యరా అమ్మగారూ నాకు?" అంటూ ఓ రోజు పనిమనిషి భాగ్యలక్ష్మిని అడగడంతో, వాళ్ళిద్దరి మధ్యా వైరానికి నాంది పలికింది. "కొత్త చీరా? సరేలే... నేనే కొనుక్కోవట్లేదు... నీకేం కొనివ్వమన్నావు?" నసిగింది భాగ్యలక్ష్మి.

"ఏంటమ్మగారూ? పక్కింటి సామ్రాజ్యం అమ్మగారు కొత్తచీర అడగ్గానే సరేనన్నారు. మీరు కూడా తప్పకుండా ఇస్తారని ఆశపెట్టుకున్నాను".

"పక్కింటమ్మగారిస్తే నేనివ్వాలని ఉందా?"

"అయ్యో! అదేంటమ్మగారూ? మీ ఇద్దరి మధ్యా ఏవో గొడవలున్నాయని ఆ కోపం నా మీద చూపిస్తారేంటమ్మా?"

తెల్లబోయింది ఆ మాటతో భాగ్యలక్ష్మి. "మా ఇద్దరి మధ్యా గొడవలా? చాల్లే... నోటి కెంతొస్తే అంతా మాట్లాడకు".

"నాకేంపనమ్మా అలా మాట్లాడటానికి... ఆ అమ్మగారు నిన్న సాయంత్రం సణుక్కుంటుంటే విన్నాను కాబట్టి నాకు తెల్సింది. మీ మూలాన ఆ అమ్మగారు టి.వి.లో పాటలూ, సినిమాలూ, నాటకాలూ చూడలేకపోతున్నారట. అసలైనా అమ్మగారూ... నాకు తెలియకడుగుతానూ... మాటలు పడటం ఎందుకూ మీరు? మీరు ఓ టి.వి. కొనేసుకుంటే పోలా?" సలహా జోడించింది.

అగ్గిమీద గుగ్గిలమే అయింది భాగ్యలక్ష్మి. "ఏమిటి... నేను వాళ్ళింటికి టి.వి. చూడటానికి వొస్తున్నాను కదా అని. అందరి దగ్గిరా నా మీద ఏవేవో చెప్పి నన్ను తిడుతోందా? అలాంటప్పుడు... మొహమాటపడకుండా టి.వి. చూడటానికి వాళ్ళింటికి రమ్మని తనంతట తనే మరీ మరీ ఎందుకు చెప్పింది నాతో. అప్పుడేమో అలా చెప్పి, నా వెనకాలేమో ఇలా మాట్లాడుతోంధా?... నేను కాసేపు పడుకుందామనో, మిషన్ మీద ఏదన్నా కుట్టుకుందామనో, ఏనవలో చదువుకుందామనో అనుకున్నప్పుడే, మిక్సీలో ఇది రుబ్బి పెట్టవా, ఈ పొడిచేసి పెట్టవా అంటూ ఆ మహాతల్లి నా ఇంటికి తయారవ్వట్లేదా? సిగ్గులేకపోతే సరి...." దండకం చదువుకు పోయింది భాగ్యలక్ష్మి.

ఆ పనిమనిషి, తనకెందుకులెమ్మని ఊరుకుందా? ఆ సాయంత్రం సామ్రాజ్యం వాళ్ళింట్లో సన్నగా మొదలెట్టింది. "అసలైనా మీరో మిక్సీ కొనుక్కుంటే పోతుందిగా అమ్మగారూ!"

"ఏం! నేను మిక్సీ కొనుక్కోలేదని నీకెందుకూ జాలి?"

"జాలిపడక ఏం చెయ్యమన్నారమ్మగారూ... ఆ భాగ్యమ్మగారు నానా మాటలూ అంటున్నారు మిమ్మల్ని మరి!...."

"దేనికి?"

"ఇంక దేనికమ్మగారూ... వేళాపాళా లేకుండా మీరా అమ్మగారింటికెళ్ళి వాళ్ళ మిక్సీలో ఏదో ఒకటి చేయించుకుంటూ తగని బాధ పెట్టేస్తున్నారట వాళ్ళని. ఆ అమ్మగారు తెగ ఆడిపోసుకుంటున్నారు మిమ్మల్ని".

ఒంటికి కారం రాసినట్టయింది సామ్రాజ్యానికి

"నీకెప్పుడేంకావాలన్నా అడుగు మొహమాటపడకుండా, నా మిక్సీలో చేసిపెడతాను అంటూ ఆ రోజేమో తియ్యగా అంత ఇదిగా చెప్పి, ఈ రోజిలా విసుక్కుంటోందా? మాకేం గతిలేదనుకుంటోంది కాబోలు... అలాంటి మనిషి టి.వి. చూడటానికి మా ఇంటికెందుకూ రావడం? సిగ్గులేకపోతే సరి. ఆ పిల్లలేమో నా ప్రాణాలు తినేస్తూ వుంటారు అల్లరితో... అదంతా నేను చచ్చినట్టు భరించాలా?" దండకం అరగంటసేపు చదువుకుపోయింది సామ్రాజ్యం. అంతే ఆ... రోజునించీ ఇద్దరిమనసులూ కుతకుతా ఉడికిపోతున్నాయి. ఇద్దరూ ఒకరినొకరు శత్రువుల్లా చూసుకోవడం మొదలెట్టారు... అంతేగానీ, తప్పు తమ ఇద్దరి లోనూ వుందన్న సంగతి అర్థం చేసుకోలేదు వాళ్ళు.

"రెండు కరివేప రెబ్బలిస్తావూ భాగ్యం!...." అంటూ ఆ రోజు పెరటి గోడ దగ్గరికొచ్చింది సామ్రాజ్యం అత్తగారు. ఆ రోజే వాళ్ళ ఊర్నించి వొచ్చిందావిడ కొడుకు దగ్గరకి. అప్పుడప్పుడు ఈ ఊరొచ్చి ఓ పది రోజులుండి వెళ్తూ ఉంటుంది. ఇది వరకటి అలవాటుని బట్టి, చనువుగా అడిగింది భాగ్యాన్ని పిలిచి, కరివేప చెట్లు రెండు పెద్ద పెద్దవున్నాయి వాళ్ళ పెరట్లో.

"అట్టే ఆకు లేదు. కొత్త కొమ్మలు రావాలి. ఇప్పుడు కొయ్యడం వీలుకాదు". విసురుగా అనేసి లోపలికి వెళ్ళిపోయింది భాగ్యం. "అంత ఆకుంటే, ఇంకా కొమ్మలు రావాలంటున్నావేమిటి? రోజూ మీరు కోసుకుంటున్న చెట్టేగా?" వింతగా చూస్తూ బుగ్గలు నొక్కుకుందావిడ.

"ఆంటీ... కిషోర్ ఉన్నాడా ఇంట్లో" వాడితో కల్సి ఆడుకునేందుకు వొచ్చి గుమ్మంలో నిలబడి అడిగాడు శీను ఆ రోజు సాయంత్రం.

"వాడింట్లో వుంటే నీకేం, లేకపోతే నీకేం నాయనా?" కస్సుమంది సామ్రాజ్యం ఆ చిన్న పిల్లాడి మీద. బిక్కమొహం వేసుకుని అక్కడినించి వెళ్ళిపోయాడు శీను.

!+!+!+!

ఆ రోజు సాయంత్రం భాగ్యలక్ష్మి, సామ్రాజ్యం ఎవరిళ్ళల్లో వాళ్ళు వంటింట్లో పనుల్లో వున్నారు.

బయట కిషోర్, శీను పరుగులు పెట్టి ఒకళ్ళనొకళ్ళు ముట్టుకునే ఆట ఆడుకుంటున్నారు. హఠాత్తుగా కిషోర్ ఏడుపుతో సామ్రాజ్యం వీధిగుమ్మంలోకి పరిగెత్తుకొచ్చింది. కిషోర్ కాలికి దెబ్బ తగిలింది. గట్టుమీద కూచుని కాలు పట్టుకుని ఏడుస్తున్నాడు. ఎదురుగా శీను నిలబడి ఉన్నాడు.

"ఏమైందిరా?" వాడి కాలికి తగిలిన ఆ దెబ్బ కనిపిస్తున్నా కూడా, ఎప్పుడూ, ఎక్కడో అక్కడ పడి దెబ్బలు తగిలించుకోడం పిల్లలకి మామూలే కాబట్టి, అది అంతగా పట్టించుకోకుండా, ఏదో అడగాలి కదా అన్నట్టుగా అడిగింది సామ్రాజ్యం.

"శీను, నన్ను తోసేశాడు. ఇదుగో ఇక్కడ దెబ్బ తగిలింది" ఏడుస్తూనే చెప్పాడువాడు.

వాడంతటవాడే పరిగెడుతూ పడివుంటే, "అదే పోతుందిలే, ఏడవకు" అంటూ పెద్దగా పట్టించుకోకుండా లోపలికి వెళ్ళిపోయేదే... శీను తోసేశాడనేసరికి, అసలే వాళ్ళమ్మంటే ఇప్పుడు పడటం లేదు. కాబట్టి, తన కోపం అంతా ప్రదర్శించుకునేందుకు ఛాన్సు దొరికిందనిపించింది. ఇంక ఇంతనోరు చేసుకొని పెద్దగా అరవడం మొదలు పెట్టింది. "నీకసలు బుద్ధి లేదురా, వాడితో సావాసం మానెయ్యమన్నానా లేదా నిన్ను... ఇంకెవరూ లేనట్టు వాడితో ఆడతావెందుకూ? బుద్ధీ, జ్ఞానం ఆ పెద్దవాళ్ళకే లేనప్పుడు వాడికెందు కుంటుందీ?...." ఆపకుండా, అంతకంతకీ గొంతు పెంచి అరుస్తోంది సామ్రాజ్యం. ఆ అరుపులూ, తిట్లూ వినపడి లోపల్నుంచి బయటికొచ్చింది భాగ్యలక్ష్మి. వస్తూనే తనూ అందుకుంది తిట్లదండకం.

"మీ వాడేదో మహా బుద్ధిమంతుడిలా, మా అబ్బాయి నెందుకూ తిడతావు పట్టుకుని... మీవాడి అల్లరి మటుకు మాకు తెలియదు గనకనా? మొన్న సాయంత్రం మా పిల్లాడిని పట్టుకుని కొట్టలేదూ ఆటల్లో కోపం వచ్చి, అసలప్పుడే చెప్పాను మావాడితో ఆ అల్లరి గడుగ్గాయితో నువ్వాడకురా అని... ఇంకెవరూ ఈ వీధిలో పిల్లలే లేనట్టు ఆ కిషోర్ గాడితో స్నేహం ఎందుకురా నీకని, నాలుగు వాయించాను కూడా వీపు మీద. కానీ, మీ పిల్లాడే మావాడిని పట్టుకుని వేళ్ళాడుతున్నాడు...."

"సిగ్గులేకపోతే సరి ఆ మాటనడానికి!... మీ వాడే మా అబ్బాయిని జిగురులా అంటుకుని తిరుగుతున్నాడు. లేకపోతే మీవాడితో ఆడుకునే ఖర్మ మా అబ్బాయికేం పట్టలేదు".

"ఇదుగో మాటలు జాగ్రత్తగా రానీ, సామ్రాజ్యం..."

"ఏం నువ్వు బెదిరిస్తే బెదిరిపోతాననుకున్నావా?"

"ఛీ.. ఛీ... నీతో వాదించడం నాకనవసరం".

"నాకంతకంటే అనవసరం" ఇద్దరి గొంతులూ నెప్పెట్టినట్టున్నాయి. లేకపోతే ఇంకాస్సేపు ఆ మాటల యుద్ధం సాగేదే.....

"వాళ్ళతో నీకేమిటి... వొచ్చెయ్యరా నువ్వు లోపలికి" కొడుకుని కేకేస్తూ అటువైపు చూసిందప్పుడు సామ్రాజ్యం. అప్పటిదాకా భాగ్యలక్ష్మితో హోరాహోరీ పోరాటమే తప్ప, కొడుక్కి తగిలిన దెబ్బ సంగతే మర్చిపోయింది.

"నువ్వూ వొచ్చెయ్యరా లోపలికి. వాళ్ళతో మనకేమిటి" అంటూ తనుకూడా అప్పుడే పిల్లలవైపు చూసింది భాగ్యలక్ష్మి.

కిషోర్ కాలినించి వస్తున్న రక్తాన్ని తన చిన్నారి చేతుల్తో కడిగి తుడిచి, తన కాలిదెబ్బలకి అప్పుడప్పుడు అమ్మ రాస్తుండే మందు ట్యూబ్ తీసుకొచ్చి ఇంట్లోంచి, కిషోర్ కాలిమీద రాస్తూ "బాగా నెప్పెడుతోందా కిషోర్... ఇంకెప్పుడూ అలా తొయ్యన్లే నిన్ను... అసలు నువ్వలా పడిపోతావని నేననుకోలేదు... కోపం వచ్చిందా నా మీద?" అంటున్నాడు శీను.

"నాకేం కోపం రాలేదు... నువ్వూ, నేనూ జట్టుకదా... అసలైనా నాకు నెప్పి పెట్టట్లేదు... కొంచెం రక్తం వొచ్చేసరికి... ఆ రక్తాన్ని చూసి భయపడి ఏడ్చానంతే... ఇప్పుడింకరక్తం రావట్లేదుగా... మళ్ళీ ఆడుకోవచ్చు మనం ఎంచక్కా... మందుకూడా రాశావుగా... కాసేపట్లో అంతా తగ్గిపోతుంది. నీకెప్పుడైనా దెబ్బ తగిల్తే నువ్వూ ఈ మందే రాసుకుంటూ వుంటావా?"

"ఊ... ఇదే రాసుకుంటాను.. తగ్గిపోతుంది..." ఇంక ఈ మందు లోపల దాచేసొస్తాను... ఇంకాస్సేపు ఆడుకుందాం"

వాళ్ళ మాటలు వింటున్న ఆ తల్లుల మొహాలు తెల్లగా పాలిపోయాయి.

★☆★☆★